

# కోకిలారవ భ్రాంతి

"వెళ్ళొస్తా" నంటూ మెట్లు దిగుతున్న సుశీలకు ఏమీ సమాధానం చెప్పలేక పోయాడు కృష్ణారావు. సుశీల పొంగివచ్చే కన్నీటి కెరటాలకు పమిటకొంగు అడ్డం చేసుకుంటూ కారులో కూర్చుంటున్నప్పుడు మాత్రం కన్నీటితో ఆమెను చూడగలిగాడు. కృష్ణారావు చూపులు కారుకు త్రోవలు చూపిస్తున్నయ్. సుశీల పోతూంటే అతనిలో ఏమాత్రం విషాదం కనుపించకపోగా ఎంతో క్రోధాన్ని, నిరసనని మాత్రం చూపగలుగుతున్నాడు. డ్రైవరు సూట్ కేసు లోపల పెట్టి తన సీటులోకి వెళ్ళి కూర్చున్నాడు. సుశీల చేతుల్లో తలదూర్చి ఏడుస్తోంది. వరండాలో కృష్ణారావు తప్ప మరో వ్యక్తి కనుపించటం లేదు. కారులో వున్న సుశీలా, డ్రైవరు తప్ప ఆ ప్రాంతంలో వేరే ఎవరూ లేరు. దూరాన గేటువద్ద మాత్రం కీపర్ వెంకాయి కూర్చుని బజారుకేసి చూస్తున్నాడు. వాడికి లోపల జరిగే హడావిడి ఏదీ పట్టినట్లుగా లేదు. నిశ్చింతగా బజారునపోయే బస్సులకేసి, మనుషులకేసి చూస్తూ నిలబడ్డాడు.

కారు 'రుయ్' మంటూ వరండా ముందు నుండి గేటుగుండా దూసుకు పోయింది. కీపర్ వెంకాయికి దాంట్లో కనిపించినదల్లా సుశీలమ్మగారు, డ్రైవరు మాత్రమే. అయ్యగారు లేకుండా అమ్మగారొక్కతే ఎక్కడకు వెళుతుందో వాడూహించలేక పోయాడు. ఎప్పుడూ అయ్యగారు లోపల వుండగా అమ్మగారొక్కతే బయటకు వెళ్ళటం వాడి అనుభవంలో ఎరగడు. కారుపోగానే గేటువేసి వరండాలోకి పోదామనుకుంటూ ప్రక్కనే క్రోటన్సును రాసుకుంటూ బయలుదేరాడు. వరండాలో కృష్ణారావు అయ్యగారొక్కరే నిలబడి గేటుకేసి చూస్తున్నారు. వెంకాయికి పైప్రాణాలు పైనే పోయినంత పనయింది. అయ్యగారెప్పుడూ ఒక్కరే అలా నిలబడివుండటం ఆయింట చరిత్రలో కొత్త అధ్యాయాన్ని ప్రవేశపెట్టినట్లుగా వుంది. కాని వెంకాయి మాత్రం భయపడిపోతున్నాడు. తనేదో తప్పు చేసినట్లు, అందువల్లనే అయ్యగారు తననలా కోపంగా చూస్తున్నట్లుగా భావించాడు. గేటు వేయటం అయ్యగారి కేమైనా కోపకారణమైందేమోనని రెండుసార్లు గేటువైపు, మూడుసార్లు అయ్యగారివైపు పరకాయించి చూచాడు వెంకాయి. కాని అదేం కారణమయినట్టుగా తోచలేదు. వెంకాయి మెల్లిగా అడుగుల్లో అడుగులు వేసుకుంటూ కృష్ణారావును సమీపించాడు. కాని కృష్ణారావు తనవైపు చూస్తున్నట్లుగా లేదు. గేటులోగుండా కారుపోయిన బజారువైపే చూస్తున్నాడు. కృష్ణారావు కళ్ళు చెమ్మగిలి తళతళ మంటున్నయ్. అచేతనంగా నిలబడి వున్న అయ్యగారిని చూస్తుంటే వెంకాయి కాళ్ళక్రింద భూమి కరగిపోతున్నట్లుగా వుంది. తన శరీరం అప్పటికప్పుడే పంచభూతాల్లో కలసిపోతున్నట్లుగా వుంది. వెంకాయికి అయ్యగారిని మాట్లాడించాలో, మాట్లాడించకూడదో కూడా అర్థం కావడంలేదు. మాట్లాడిస్తే ఏం శపిస్తారో, మాట్లాడించకపోతే ఏం కోపమొస్తుందో కూడా

వి. శార్వరి

అంతుపట్టలా. కృష్ణారావు మాత్రం ప్రపంచాన్నంతా మరచిపోయి బజారులో కళ్లుపెట్టుకు నిలుచున్నాడు. కారు ఏయేమూలలు తిరిగిందో, ఎన్ని మేడలు దాటిందో ఊహాపథంలో లెక్కించుకుంటున్నాడు. ఏవో బళ్లు అడ్డం వస్తున్నట్లు, అప్పుడప్పుడు కారు ఆగుతున్నట్లు కనిపిస్తుంది కృష్ణారావుకు...

కారు అక్కడే సెంట్రల్ చౌకు దాటుతూంది. ఆళ్వారుగారి మేడ సమీపించి నేరుగా చౌకు దాటి రైలురోడ్డుకు చేరుకుంది. అక్కడ కారు ఆగింది. ఎందు కాగినట్లు? మరో కారు ఎదురుగావచ్చి అక్కడే ఆగింది. వళ్లీ వెంటనే రెండూ బయలుదేరినై. ఎకాఎకిని స్టేషనుకు వెళ్లింది. డ్రైవరు టిక్కెట్టుతీసుకొచ్చి సుశీలతో మాట్లాడుతున్నాడు. వెయిటింగురూములో కూర్చున్న సుశీల అటూ ఇటూ కృష్ణారావు వస్తున్నాడేమోనని పరకాయించి చూచి ఆ డ్రైవరుగాడితో నవ్వుతూ మాట్లాడుతూంది. వాడు సుశీల కళ్ళలో నీళ్ళు తుడుస్తూ ఓదారుస్తున్నాడు ద్రోహి. (కృష్ణారావుకు వళ్ళుమండుతోంది. పళ్ళు పటపటా కొరుకుతున్నాడు. కీపరు వెంకాయ్ ప్రక్కనే వణికిపోతున్నాడు. కళ్ళవెంట నీరు కారుస్తున్నాడు.)

డ్రైవరుగాడు సుశీలతో చాలాసేపుగా మాట్లాడుతున్నాడు. ఆమె కూడా చాలా నవ్వుతూ మట్లాడుతూంది. ఇందాకటి నుంచీ ఏడ్చిన ఏడుపంతా ఒక్కసారి డ్రైవరు మాటలతో మాయమయింది. ఇంతలో ప్లాటుఫారం పైన అలజడి ఎక్కువైంది. దూరాన రైలుకూత వినబడింది. రైల్వే కూలీలు "కూలి" "కూలీ" అంటూ కేకలేస్తున్నారు.

రైలు స్టేషనులో ఆగింది. డ్రైవరు సూటుకేసు పట్టుకుని నడుస్తున్నాడు. వాడికి ముందు వైపుగా సుశీల నడుస్తూంది. ఫస్టుక్లాసు స్పెషల్లోకి వెళ్లి కూర్చుంది. డ్రైవరు కేసు బెడ్‌మీద పెట్టి మళ్ళీ సుశీలతో కబుర్లు ప్రారంభించాడు. అంతలోనే రైలుకూత వినబడింది. సుశీల తొందరగా "రైలు టయిమయినట్లుంది" అంది.

(కృష్ణారావు కళ్ళలోని నీళ్ళు క్రిందకు జారినయ్. కళ్లు ఎర్రగా జ్యోతుల్లాగా వెలుగుతున్నయ్. కళ్లు ఫెళఫెళా మోతలు పెడుతున్నయ్.)

రైలు కదిలింది. పెద్ద పీరుడులాగా పోతూన్న రైల్లోనుండి దిగాడు డ్రైవరు. ఇంజను కూతలు పెట్టుకుంటూ పోతోంది బండితో సహా. డ్రైవరుతో సహా మరి కొద్దిమంది మాత్రమే ప్లాటుఫారంమీద మిగిలారు. డ్రైవరు కారు వేసుకుని ఇంటికి బయలుదేరాడు.

"బాబుగారూ" అంటూ వెంకాయి కృష్ణారావు కళ్ళల్లోకి చూశాడు. కృష్ణారావు ఆ పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాడు. ఊహాపథంలో ఇందాకటనుండి చూచిందల్లా నిజమే ననుకుంటున్నాడు. "అరే, గేటు తాళం వేసిరా" అని లోపలకు వెళ్ళిపోయాడు.

కృష్ణారావు గదిలో కడుకున్నాడనేగాని అతనికేమీ పాలుపోవడం లేదు. పైపెచ్చు ఏడవాలనిపిస్తున్నది. కాని తాను పురుషుడు. పురుషుడైయుండికూడా ఏడ్చి తనలో అనవసరంగా అబలాత్వం ప్రవేశపెట్టుకోవటం తనకిష్టంలేదు.

కృష్ణారావు వస్తుతః చాలా తెలివైనవాడు. తెలివైనవాడని తను అనుకోవడమే కాకుండా తన స్నేహితులు చాలామంది అలాగే అంటున్నారు. తన మామగారుకూడ అట్లా అనుకునే సుశీలనిచ్చి పెళ్లిచేశాడు. సుశీలకూడా చాలా తెలివైందని, చదువుకుందని, పైపెచ్చు సంగీతం కూడా నేర్చుకుందని తన మామగారు బాగా నచ్చచెప్పారు. వాళ్లు నచ్చచెప్పకపోతేమాత్రం తన తల్లీ తండ్రీ వూరుకున్నారా? అందాల గుమ్మని, ఒక్కతే ఒక్క కూతురని, అలాంటి పిల్ల కావాలంటేమాత్రం దొరుకుతుందాని ఎన్నో వాగారు. అయితే మామగారి తరఫు ఆస్తంతా ఇవ్వాళ గాకపోతే రేపైనా మనవాడికే వస్తుందిగదాని ముసిలివాళ్లు ఆశపడ్డారనుకో, అంత గుడ్డిగా తనుమాత్రం ఎట్లా ఒప్పుకున్నాడు? పైకి మీ యిష్టమని అనాడు లాంఛనంగా అన్నాడేగాని తనెంత మోజుపడ్డాడు! వాళ్ళ యిష్టమంటే పుటిక్కిన ఈసంబంధం మానుకుంటారేమోనని ఎంతో మథన పడ్డాడు. ఒకవేళ వాళ్లువద్దన్నా పోట్లాడైనా సుశీలనే చేసుకోవాలనుకున్నాడు.

మొత్తానికి సుశీల ఆనాటికీ ఈనాటికీ ఒకటిగా లేదు. సుశీలలో మార్పు రాకపోయినా సుశీల మనస్సులో మార్పు వచ్చింది. ఆనాడు ఎంతో అమాయికంగా తనంటే ఎంతో ఇదయ్యేది. సుశీలేగాదు, ఆ యింటిల్లి పాదీ తనంటే ఎంతో గౌరవంగా ప్రేమగా వుండేవారు. అందరిలోనూ తను సుశీలను మాత్రమే ప్రేమించ గలిగాడు.

సుశీల తన యింటికి వచ్చిన లగాయతూ ఎంతో ప్రేమగా వుంటూవుండేది. ఆమె కాపరానికి రాగానే తను సూపర్నెంటుగా మారాడు. అదంతా సుశీల నోచుకుని వుండటం వల్లనే అన్నాని వాళ్ళూ వీళ్ళూ అంటే నమ్మాడు. అందుకనే సుశీలను ఒక్క నిమిషంగూడ వదిలిపెట్టి వుండలేక పోయేవాడు. కాని వెధవుద్యోగం క్యాంపులని, పనని ఇంటిపట్టున నాలుగు రోజులైనా వుండేవాడు గాదు. ఏం చేస్తాడు. తనకు వుండాలని వున్నా తన విధిని నిర్వర్తించ లేకుండా వుండేవాడుగాదు. ఒంటరిగా సుశీలను వదలి వెళ్ళటమంటే ప్రాణానికొచ్చేది. మరీ తన అమ్మా వాళ్ళుపోయిన దగ్గరనుంచీ మహాయాతనైపోయింది. ఈ సమయంలో కలెక్టరుగారితో బంధురికం కలిసివుండటం కూడా మంచిదయింది. ఇప్పుడంతా అలవాటైపోయింది. క్యాంపుల్లోనే తనకు కావలసిన సుఖాలన్నీ అనుభవించటం మొదలెట్టిన తరువాత సుశీల మాట అంతగా జ్ఞాపకం వుండేదిగాదు.

సుశీల యింతపని చేస్తుందని తనెప్పుడూ అనుకోలేదు. కనీసం వూహించనైనా లేదు. అలా వూహించిన పక్షంలో కొంత జాగ్రత్తగా వుండేవాడేమో! తను విచ్చలవిడిగా క్యాంపుల్లో కూర్చుని సుశీల విషయం మర్చిపోయేవాడు గాడేమో! కాని అంతా గతించిన తర్వాత ఇప్పుడావిషయాన్ని గురించి తర్కించుకుని ఏమీ లాభంలేదు. కాని తను కొంత శాంతం వహించి నట్లయితే ఏం జరిగేదో? సుశీల తనకై తాను వచ్చి తన కాళ్ళమీదపడి క్షమార్పణ వేడుకునేదేమో! అప్పుడు తన మనస్సు ఎలా వుండేదో! సుశీలను క్షమించ గలిగేవాడేమో!

ఇదంతా ఆలోచించుకుని యిప్పుడు బాధు గరచుకుని ఏమీ ప్రయోజనం లేదనుకున్నాడు. వెంటనే పోయి సుశీలను పిలుచుకొస్తే బావుంటుందేమో. అనవసరంగా తమ కలహాన్ని యితరులెవరికీ తెలియచెప్పకుండా పోతుంది. తన గౌరవానికి ఏవిధమైన హానీ గలగకుండా వుంటుంది. ఇప్పుడైనా ఫరవాలేదనుకొని, కృష్ణారావుకు సుశీలమీద వున్న నమ్మకం పోలేదు. తనను గురించి ఏవిధంగానూ దుష్ప్రచారం చెయ్యదని వూహించాడు. కాని తనకూ, ఆమెకూ ఏమీ సంబంధం వుండనక్కరలేదని, వెళ్ళగొట్టబడిన సుశీల తన శీలాన్ని, గౌరవాన్ని కాపాడుతుందన్న నమ్మకమేమిటి? పైగా తన బ్రతుకు బజారుకెక్కిస్తే తను చేయగలిగిందేమిటి? పాత ఆఫీసర్లంతా తనను ఎగతాళి చేస్తే తను ఖూనీ చేసుకోకుండా ఎలా వుండగలడు! కనీసం తన పరువు మర్యాదల్ని నిలబెట్టుకునేందుకైనా సుశీలను తీసుకురావాలనుకున్నాడు.

ఈమహత్తర సందేశాన్ని ప్రసాదించినందుకు గోడకు వేళ్ళాడగట్టిన దేవుళ్ళ మూర్తులకు ధన్యవాదాలర్పిస్తూ గదిబయటకు నడిచాడు. ఇంతలో డ్రైవరు కారు లోపలకు నడుపుకు వచ్చాడు. కృష్ణారావుకు వాడి మొఖం చూడబుద్ధి కాలేదు. గదిలోకి నడిచి తలుపులు బిడాయించుకున్నాడు. ఇవే ఆలోచనలతో మంచంమీద పడుకుని కప్పుకేసి చూస్తున్నాడు.

ఈ డ్రైవరు తన సుశీలను స్టేషనుకే పంపాడో మరెక్కడకైనా తీసుకెళ్ళి తన అజమాయిషీలో వుంచుకున్నాడేమో! ఒఠ్ఠిదొంగవెధవ. ఇనింట్లో లేకుండా చూసి తననే మోసంచేసినవాడు అమాయికపు సుశీలను మోసం చెయ్యటంలో కష్టం లేదు. సుశీలను స్టేషనులో దిగబెట్టినట్లుగా తనకేం నమ్మకం చిక్కటంలేదు. తనే ఎక్కడో దిగబెట్టుకుని వుంటాడు డ్రైవరును వెంటనే చంపేద్దా మనిపించింది. ఇల్లంతా వెదికినా ఎక్కడా రివాల్వర్ కనిపించలేదు. అది మొన్న క్యాంపుకువెళ్ళి వస్తూ కలెక్టరుగారింట్లో మర్చిపోయినసంగతి తరువాత అరగంటకు జ్ఞాపకం రాలేదు. లేకపోయినట్లయితే వాడీపాటికి యమసదనానికి వెళ్ళి వుండేవాడే.

అలాగే ఆలోచిస్తూ పడుకున్నాడు కృష్ణారావు, ఈ విషమపరిస్థితులు సమకూడటానికి గల కారణాల నొక్కొక్కటే నెమరు వేసుకుంటూ.

ఈవేళకు నిన్న తను ట్రెయిన్లో వున్నాడు. ఫస్టుక్లాసులో కూర్చుని హాయిగా సిగరెట్టు ముట్టిస్తున్నాడు. చదువుతూన్న పుస్తకం తను వెలిగించే లోపల క్రిందకు జారిపోయింది కూడా. తన బలానికి తనే నవ్వుకుని పుస్తకం చేతిలోకి తీసుకుని ఆరిపోయిన పుల్లను బయటకు విసిరివేశాడు. అంతలోకే కారు హారన్ వినిపించింది రైలు మోతలను దూసుకుంటూ. ఇంకా వూరు మూడుమైళ్ళు వుంది. రైలు నలభైమైళ్ళవేగంలో మోతలు పెట్టుకుంటూ పోతూంది. ప్రక్కనే రోడ్డుమీద కారు అంతకు కొంచెం వేగంలో పోతోంది. హారన్ గుర్తుపట్టి కృష్ణారావు ఆ వైపు తిరిగాడు. తనదే కారు, అదేం సుశీలే నడుపుతోంది కారును. షైరుకు వచ్చింది గదా అనుకున్నాడు. కాని ప్రక్కనే మరోవ్యక్తి కూర్చుని సుశీలతో కబుర్లు చెబుతున్నాడు. సుశీల నవ్వుతో ఆతనితో ఖుషీగా సరదా లాడుతోంది. కృష్ణారావు నమ్మలేకపోయాడు, తన సుశీల కాదేమో ననుకున్నాడు. కాని తన సుశీలేనని పోల్చుకున్నాడు. పోల్చుకున్నాక తన వంటి నిండా జెర్రులు ప్రాకినయ్.

అక్కడనుండి క్రిందికిదూకుదామనుకున్నాడు. కాని ప్రాణాలమీద తీపివల్ల అంతపని చేయలేకపోయాడు. గొలుసులాగి దిగుదామన్న వూహా తట్టకపోలేదు. కాని అది ఆగి, తాను దిగేలోపల వారు దాటే పోతారనుకున్నాడు. అందువల్ల యింటికి వెళ్ళి యిద్దరినీ నరికేద్దామనుకున్నాడు.

కాని యింటి కెళ్లేసరికి అంతధైర్యం లేకపోయింది. షెడ్‌కు ఇవతలగా కారు ఆపివుంది. వెంటనే నిప్పులు గ్రక్కుకుంటూ లోపల ప్రవేశించాడు. ఎవరూ వున్నట్టుగా లేరు. అయితే తాను పొంచి చూచింది అంతా నిజమే ననుకున్నాడు. కాని కారిక్కడేవుంది. వాళ్ళెక్కడ? ఇదే కారులో ఎలా వెళ్ళివుంటారు? అసంభవం. వాళ్ళెవరో, తాను భ్రమించాడు వారిని చూచి. తన సుశీల అంత అఘాయిత్యం చెయ్యదని అనుకున్నాడు. ఆలా చేయగల ధైర్యం కూడా లేదనుకున్నాడు. ఇట్లా ఆలోచించుకుంటూ గది తలుపులు తీశాడు. లోపలకువెళ్లి సూటు బూటు విప్పుదామని...

* * *

అంతలోకి కృష్ణారావుకు నిద్రవచ్చింది. తరువాత జరిగిందంతాతిరిగి జ్ఞప్తికి తెచ్చుకోకుండానే నిద్రపోయాడు. నిద్రలేచేసరికి గడియారం అయిదున్నర కొట్టింది. కళ్లునులుపుకుంటూ బయటకు వచ్చాడు కృష్ణాలావు. వెంకాయి ఓకాగితం పట్టుకొచ్చి "డయివోరు మీకియ్యమని చెప్పాడు బాబూ" అంటూ చేతికిచ్చాడు. కృష్ణారావు అటూ యిటూ పరికిస్తూ దీసి చదువుకున్నాడు.

అయ్యగారికి:—

నమస్కారములు.


ఇకనుండి మీ పనిలోకి రావటం విరమించుకున్నాను గనుక తెలియజేయటమైనది.

మీ.........

కృష్ణారావుకు కొంత భారం తీరినట్లయింది. వీడీ పని మొదట్లోనే చేసినట్లయితే సుశీలకు స్వస్థి చెప్పివుండకపోను. కాని అంతా గడచిపోయిన తరువాత వెళ్ళిపోయాడు. అయినా వదిలిపోయాడు అనుకున్నాడు.

స్నానంచేయటానికిబాత్‌రూమ్‌లోకివెళ్ళాడు వెంకాయి నీళ్లు అందిస్తుంటే చకచకా స్నానం చేస్తున్నాడు. ఈపాటికి తన సుశీల పుట్టింటికి చేరివుంటుంది. తనూ స్నానం చేస్తూంటుందని వూహిస్తున్నాడు కృష్ణారావు. కాని తనమీద ఫిర్యాదులన్నీ తండ్రికి రిపోర్టు చేస్తుంటుందని స్నానం ముగించుకొన్నాక కాని అనుకోలేకపోయాడు. రోజూ తను స్నానం చేసేసరికి సుశీల తలదువ్వుకుంటూ కబుర్లు చెప్తూ వుండేది. కాని ఇవ్వాళ ఆమె స్థానే వెంకాయి కబుర్లు చెప్పటం ప్రారంభించాడు. కాని తనకు విన బుద్ధికాకపోవటంవల్ల వాడి సంభాషణలు ఆపివేయవలసి వచ్చింది.

ఇంటికి తాళంవేసి, వాకిట్లో వెంకాయిని కాపలా పెట్టి స్వయంగా నడుపుకుంటూ పోతున్నాడు కారును. కృష్ణారావు యిదివర కెప్పుడూ ఒంటరిగా వెళ్లేవాడుగాడు. కాని ఈనాడు అట్లా నడుపుకోవలసిన అవసరంవచ్చింది. మలుపులన్నీ తిరుగుతూ కారు కలెక్టరుగారింటి ముందు ఆగింది. వాకిట్లో ప్యూను గేటుదీసి కారు లోపలికి రానియ్యండి బాబూ అన్నాడు. కృష్ణారావు లోపలకు పోనిచ్చి తనూ లోపలికి ప్రవేశించాడు. కలెక్టరుగా రున్నట్లు ఎక్కడా



ఛాయలు కనుపించటంలేదు. లోపల గదిలోంచి ఎవరో వ్యక్తి వంటింట్లోకి పోతూంది.

"అమ్మాయ్, బాబుగారు లేరమ్మా" అని అడిగాడు కృష్ణారావు.

ఆ వ్యక్తి తన ప్రశ్నకి సమాధానం చెప్పకండానే దొడ్లోకి వెళ్ళిపోయింది. కృష్ణారావుకు ఎవరిని ప్రశ్నించాలో అర్థం గాలేదు.

లైటువేసి శాంతమ్మగారు జడవేసుకుంటూ బయటకు వచ్చింది.

శాంతమ్మకు దాదాపు ఇరవైమూడేళ్లు వుంటయ్. పచ్చగా బత్తాయిపండులాంటి శరీరం, ఆట్టే పిల్లలు పుట్టకపోవటంవల్ల చెదని శరీర సౌందర్యం, మెరిసే కళ్లూ, దానిమ్మగింజలాంటి పళ్ళవరస, తీర్చిదిద్దిన స్వర్ణవిగ్రహంలా వుంటుంది శాంతమ్మ. కాని శాంతమ్మ ఎవరితోనూ అనవసరంగా మాట్లాడదు. తనతో ఎప్పుడూ మాట్లాడి ఎరగదు. కాని శాంతమ్మ సౌందర్యాన్ని చూసి తనే మాట్లాడుదామనుకున్నాడు కృష్ణారావు. కాని కలెక్టరుగారు తను వెళ్లినప్పుడల్లా తనతోనే వుండటంవల్ల మాట్లాడలేక పోయేవాడు. ఒకవేళ మాట్లాడదామన్నా అంత ధైర్యం వుండేదిగాదు.

శాంతమ్మ జడరిబ్బను అల్లుకుంటూ లైటు వెలుతుర్లో ఉట్టిపడే సౌందర్యాన్ని వెదజల్లుకుంటూ వచ్చి, "లేరం"టూ ఓరగా తనవంక చూస్తూ సమాధానం చెప్పింది. ఆ చూపుల్తో కృష్ణారావు సర్వాంగాలు గగుర్పొడిచినయ్. ఆపైన ఏం మాట్లాడాలో తనకు అర్థం గాలేదు: ఏం మాట్లాడితే ఏం వచ్చిపడుతుందో భయం. పైగా ఆమెవంక చూస్తూంటే ఏమనుకుంటుందోననే భయంతో నేలకేసి చూస్తూ నిలబడ్డాడు.

శాంతమ్మ "రాండి, కూర్చుందురుగాని" అని అనేవరకూ కృష్ణారావు నేలచూపులు చూస్తూ శాంతమ్మ కాలివ్రేళ్లను లెక్కబెడుతున్నాడు.

"ఆ...వెళ్లివస్తాను..." అని కృష్ణారావు వెనకడుగు వెయ్యబోతుంటే,

"మరేం ఫరవాలేదు, వారొచ్చే వేళయింది. కూర్చోండి" అని సమాధానం చెప్పింది.

వారు వస్తేమాత్రం ఎప్పుడూ మాట్లాడని ఆమె తననెందుకు వుండమంటుందో తనకర్థం గాలేదు. ఐనా తనూహించుకున్నట్లు శాంతను...

ఛీ, ఆమె ఏమనుకుంటుంది! కలెక్టరుతో రిపోర్టు చేస్తే తన పనేంగాను!

శాంతమ్మ ఒకసారి గదిలోకి వెళ్ళి వచ్చింది. కృష్ణారావు గోడలమీద వుండే బొమ్మల్ని చూస్తూ కూర్చున్నాడు. ఏం జరగబోయేదీ తనూహించలేక పోతున్నాడు. శాంతమ్మ ఏం చేస్తుంది, తనేం చేయవలసి వుంటుంది, ఆమె ఏమని ప్రశ్నిస్తుందో, దానికి తనేం సమాధానం చెప్పాలో? వెంటనే సమాధానం చెప్పకపోతే తనలో వున్న శక్తిని శంకిస్తుందేమో, ఈ ఆలోచనలతో తల తిరిగిపోయింది కృష్ణారావుకు.

శాంత సౌందర్యం లైటు వెలుతుర్లో దేదీప్యమానంగా వెలిగిపోతోంది. ఓరకంటితో తనను ఏమనో సైగ చేసింది శాంత. కృష్ణారావుకదల్లేదు.

ఆసంజ్ఞలోని అర్థం తెలుసుకోలేక కృష్ణారావు తికమక పడుతున్నాడు పాపం. నిజంగా తనేం చెయ్యాలి. ఏం జేస్తే ఏమౌతుందో కూడా అర్థం కావటం లేదు

వాకిట్లో బూట్సు చప్పుడు వినబడ్డది. రెండు గొంతుకలు సంభాషించుకుంటూ లోపలికి వస్తున్నాయ్. అందులో ఒకటి కలెక్టరు గారిదే రెండోది ఎక్కడో, ఎప్పుడో విన్న గుర్తే గాని స్పష్టంగా లేదు.

కృష్ణారావు లేచి నిలబడ్డాడు కలెక్టరుగారికి స్వాగత చిహ్నంగా కలెక్టరుతో సహా వెంకటరావు మాట్లాడుతూ లోపలి వచ్చాడు.

"ఇడుగో, బావగారు - యిక్కడే వున్నారే- క్యాంప్ నుండి వచ్చినట్టుంది" అన్నాడు వెంకటరావు కలెక్టరుతో.

"ఏమోయ్, కృష్ణారావు! నిన్న అనగా బావ మరదివస్తే యింతవరకూ మాట్లాడటానికే తీరలేదా యేం?" అన్నాడు కలెక్టరు.

కృష్ణారావుకు ఏం మాట్లాడాలో తెలీలేదు. నిన్ననగా వస్తే తన యింటికి ఎందుకు రాలేదు? పోనీ రాకపోని—తను ఉదయం చేసిన అఘాయిత్యం తెలిసిందేమో ననుకుని భయపడ్డాడు.

"ఏమండీ బావగారూ, కాంపులు కులాసాగా సాగుతున్నాయా?" అన్నాడు వెంకటరావు.

తన విషయం పీడెక్కడ పసిగట్టాడోనని చెమటలు కారుస్తున్నాడు కృష్ణారావు.

"నిన్నట్నుండీ యింటికి రాలేదేం వెంకటరావ్?" కృష్ణారావన్నాడు.

"ఇంటికే వచ్చానండీ బావగారూ, నిన్న సాయంత్రం అక్కయ్యా నేనూ షికారెళ్ళి వస్తూంటే కలెక్టరు బాబాయ్ కనిపించి 'ఎట్లాగూ మీ బావ లేడుగదా, ఒక్కడికీ ఏం తోస్తుంది. బావ వచ్చిందాకా యిక్కడుండుగానిలే' అని తీసుకొచ్చారు. అందువల్ల..." అన్నాడు.

కృష్ణారావు మనస్సు కొన్ని అడుగులు వెనక్కి పరుగెత్తింది. అయితే నిన్న సాయంత్రం చూసింది-కారులో — డ్రైవరు కాదన్నమాట - వెంకటరావా! అయ్యో ఎంత పొరబాటు.- అయితే సుశీలను వెళ్ళగొట్టటం అన్యాయమన్న మాట! నిజంగా తాను నిర్దోషి అయితే తనకెందుకు ఎదిరించలేకపోయింది సుశీల? పాపం అమాయకపుది, ఏమీ తెలియదు. అయితే డ్రైవరెందుకు రిజైన్ చేశాడు? కాదు-అంతా మోసం-తమ్ముణ్ని కూడా మోసగించి సుశీ డ్రైవరుతోనే తిరిగి వుంటుంది - కృష్ణారావు కంతా అయోమయంగా వుంది.

"ఏమోయ్, కృష్ణారావు కూర్చో, ఇవాలంతా భోజనా లిక్కడే, రేపు వెళుదురుగా నింటికి" అన్నాడు.

కలెక్టరు సుశీల సంగతి అడగడు గదా అని సందేహిస్తున్నాడు కృష్ణారావు.

ఇంతలో డ్రైవరు లోపలికొచ్చి "బాబూ కారు షెడ్‌లో పెట్టా, నే వెళ్ళొస్తా" నని వెళ్ళిపొయ్యాడు.

ఈ డ్రైవరిక్కడి కెందుకొచ్చాడో అర్థంగాలేదు కృష్ణారావుకు. "డ్రైవర్ చాలా మంచివాడోయ్ కృష్ణారావు. చాలా బాగా డ్రైవ్ చేస్తున్నాడు. పనిలో చేరిన రోజునే యింత మంచివాడనిపించుకున్న డ్రైవణ్ణి యింతవరకూ చూడలేదు." అంటూ కోటు విప్పాడు కలెక్టరు.

లోపలనుండి సుశీల జడల్లుకుంటూ వచ్చి "లేవండి బాబాయ్ స్నానాలకూ, లేరా తమ్ముడూ—మీరు కూడా లేవండి!!" అంటూ నవ్వుతూ వెళ్ళిపోయింది లోపలికి.